ప్రజాశక్తి

శనివారం 25 నవంబర్ 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు

పత్తి రైతు చిత్తు!

వర్షాభావంతో భారీగా దిగుబడి తగ్గుదల - తెగుళ్ల దాడితో తగ్గిన పూత, కాయలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పత్తి సాగులోనూ రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విత్తనాలు నాటిప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకూ సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. దిగుబడి వచ్చినా తగిన ధర ఉండటం లేదు. ఈ ఏడాది వర్షాభావం వల్ల దిగుబడి గణనీయంగా తగ్గుతోంది. వాతావరణం బాగా అనుకూలిస్తే 10 నుంచి 12 క్వింటాళ్ల సగటు దిగుబడి సాధించే అవకాశం ఉన్నా ఈ ఏడాది మాత్రం 5-7 క్వింటాళ్లు వస్తే గొప్పగా రైతులు చెబుతున్నారు.

పల్నాడు జిల్లాలో 1.55 లక్షల ఎకరాలు, గుంటూరు జిల్లాలో 45 వేల ఎకరాల్లో పత్తి సాగైంది. అక్టోబరులో వర్షాలు లేకపోవడం, 21 రోజులపాటు వేడిగాలులు ఉండటంతో పైర్లు బెట్టకొచ్చి నీటికోసం తపించాయి. కాల్వలకు నీరు విడుదల చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాలా ప్రాంతాల్లో పత్తి పైరుకు గులాబి పురుగు, ఇతర పేనుబంక తెగుళ్లు ఎక్కువగా ఆశించాయి. వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటం, ముసురు పట్టడం వల్ల ఈ తెగుళ్లు మరింతపెరిగే అవకాశాలున్నాయి. ఇప్పటికే తెగుళ్ల ధాటికి మొక్కల ఆకులు, కొమ్మలు పురుగులు తీనేస్తున్నాయి. ఒకవైపు వర్షాభావంతో పైరు ఎదుగుదల తగ్గుతుండగా తెగుళ్ల దాటికి మరింత నష్టం జరుగుతోంది.

ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవక పత్తిసాగులో తీవ్ర జాప్యమైంది. ప్రధానంగా పల్నాడు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో నాలుగు నెలల కాలంలో ఏ నెలలోనూ చాలినంత వర్షం కురవలేదు. దీంతో పైరు ఎదుగుదల కూడా ఆశించినంతగా లేదు. ఈ ప్రభావం దిగుబడిపైనా పడింది. మొదటి విడత పత్తి తీతలు దాదాపుగా ముగిశాయి. వర్షాభావం వల్ల రెండో విడత పూత, కాయలు చాలా తక్కువగా కన్పిస్తున్నాయి. దీనికి తోడు తెగుళ్ల ప్రభావం కూడా పైర్లను వెంటాడుతోంది. దీంతో రైతులకు అయోమయ పరిస్థితులు ఏర్పడ్డాయి.

ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర క్వింటాళ్ రూ.7020 ఉండగా ఇప్పటి వరకు రైతుల నుంచి ప్రైవేటు వ్యాపారులు క్వింటాళ్ రూ.6 వేలకు మించి కొనుగోలు చేయడం లేదు. గతేడాది క్వింటాళ్ రూ.6380 కనీస మద్దతు ధర కాగా గరిష్ఠంగా రైతుల వద్ద నుంచి రూ.5500కి మించి కొనుగోలు చేయలేదు. రైతుల వద్ద నుంచి దళారుల వద్దకు చేరగానే ధరలు క్వింటాళ్‌కు రూ.7 వేల నుంచి రూ.8 వేలకు పెంచారు. చాలా కాలంగా పత్తిసాగుకు అలవాటుపడిన వారు ఈ ఏడాది కూడా ఇదేబాటలో పయనించారు. గతేడాది కంటే విస్తీర్ణం తగ్గినా ధరలు పెరుగుతాయని ఆశించిన రైతులకు నిరాశ ఎదురైంది. ప్రతి ఏటా ప్రభుత్వం కనీస మద్దతు ధర సగటున 10 శాతం పెంచుతున్నా రైతులకు గతేడాది ధర కంటే తక్కువగానే దక్కుతోంది.



అమరావతి వద్ద తెగుళ్ల ధాటికి చిల్లులు పడిని పత్తి ఆకులు... పూత, కాయలు లేని పత్తిపైరు (ఇన్‌సెట్)



సంకల్ప యాత్ర పుస్తకాలను ఆవిష్కరిస్తున్న గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ తదితరులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ప్రారంభించిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులందరికీ అందించటమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరు రూరల్ లాల్‌పురంలోని ఎఎస్‌ఆర్ కన్వెన్షన్‌లో జరిగిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర ప్రారంభోత్సవానికి గవర్నర్ హాజరయ్యారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఐఈసీ వ్యాన్‌ను జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ప్రజల సంతృప్తి స్థాయిని పెంచే ప్రధాన ఉద్దేశంతో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర దేశవ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు అవగాహన కల్పించేలా నిర్వహిస్తోందన్నారు. అర్హతుండి, పథకాల ప్రయోజనాలు పొందని వారికి లబ్ధి అందించటం, పథకాల గురించి వివరించటం, అవగాహన కల్పించటం, పథకాల లబ్ధిదారులను నేరుగా కలసి వారి అనుభవాలను పంచుకోవటం, యాత్ర సమయంలో గుర్తించిన అర్హులకు పథకాలు అమలుకు నమోదు చేయటం ప్రధాన లక్ష్యాలుగా గవర్నర్ వివరించారు. కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న కొన్ని ప్రధాన కార్యక్రమాల్లో పేదకుటుంబాలకు ఉచిత ఆరోగ్య సంరక్షణకు ఏడాదికి రూ.5 లక్షలు ఆయుష్మాన్ భారత్ యోజన ద్వారా అందిస్తుందన్నారు. ప్రదాన మంత్రి ఆవాస్ యోజన, అర్బన్ హౌసింగ్ స్కీమ్, స్వచ్ఛ భారత్ అభియాన్ అర్బన్ వంటి పథకాలతో పాటు, జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ పేదరిక నిర్మూలన కార్యక్రమాలు, పిఎం స్వానిధి పథకం ద్వారా వీధి వ్యాపారులకు ఆర్థిక సహాయాన్ని అందించటం తదితర కార్యక్రమాలను అమలు జరుగుతున్నాయన్నారు. ఈ యాత్రను జిల్లాలో విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జనవరి 26 వరకు జిల్లాలోని 258 గ్రామాల్లో 60 రోజుల్లో, గుంటూరు, తాడేపల్లి మంగళగిరి నగరపాలక సంస్థలతో పాటు తెనాలి, పొన్నూరు మున్సిపాల్టీల్లో 40 ప్రాంతాల్లో 20 రోజుల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను జిల్లాకు కేటాయించిన రెండు ప్రచార వాహనాలు ద్వారా కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సభలో వికసిత్ భారత్ సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. ఆదర్శ రైతు ఆవుల వెంకటేశ్వర్లు, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న స్వయం సహాయక సంఘ సభ్యురాలు కొప్పుల జయ, లాలుపురం ఓడీఎఫ్ ప్లస్ గ్రామంగా తీర్చిదిద్దినందుకు గ్రామ ప్రత్యేక

▸ 2లో



మంగళగిరి మండలం ఎర్రబాలెంలో పారిశుధ్య కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం.రవి

కార్మిక, కర్షకులకు బిజెపి విధానాలతో చేటు

విజయవాడలో రెండ్రోజుల ధర్నాను జయప్రదం చేయాలని నాయకుల విస్తృత ప్రచారం

5 లో

చిన్నారుల అదృశ్యం కలకలం

అంతా క్షేమం కావటంతో ఊపిరి పీల్చుకున్న పోలీసులు, కుటుంబీకులు

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలో నలుగురు చిన్నారులు అదృశ్యమయ్యారు. ఒకే రోజు ఒకే ప్రాంతానికి చెందిన నలుగురూ ఒకే సారి అదృశ్యం కావటం పట్టణంలో కలకలం రేపింది. పిల్లల అదృశ్యంపై తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఎంత గాలించినా ఫలితం లేకపోవటంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఎట్టకేలకు చిన్నారులు క్షేమమనే

▸ 2లో



అదృశ్యమైన అక్కా తమ్ముళ్లు రాధిక, రాఘవేంద్ర, షేక్ అల్తాఫ్, షేక్ ఆరిఫ్ (ఫైల్)



సత్తెనపల్లిలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మల్లీశ్వరి, ఇతర నాయకులు

4 లో

8 నుండి అంగన్వాడీల సమ్మె

జయప్రదం కోసం అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ పిలుపు


విద్యార్థులతో మాట్లాడుతున్న అధ్యాపకులు త్యాగరాజ

రాజ్యాంగ ఆమోద దినోత్సవం పై వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి -పల్నాడు జిల్లా

దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డిబిఆర్‌సి) ఆధ్వర్యంలో శుక్రవారం నరసరావుపేట పట్టణంలోని నందమూరి బసవ తారకం, నల్లపాటి వెంకటేశ్వర్లు చౌదరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కామర్స్ అధ్యాపకులు డాక్టర్ ఎన్.త్యాగరాజ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా భారతదేశంలోని విభిన్న కులాల, మతాల వారు వారివారి హక్కులను పరిరక్షించుకోవాలనే ఉద్దేశంతో వివిధ రంగాల్లోని మేధావులు ప్రాథమిక హక్కులతో కూడిన రాజ్యాంగాన్ని తీసుకువచ్చారని వివరించారు. వారిలో కీలకపాత్ర పోషించిన రాజ్యాంగ రూపశిల్పి, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేసిన కృషిని గుర్తు చేశారు. రాజ్యాంగాన్ని యువతి, యువకులు తప్పనిసరిగా తెలుసు కోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలను డిబిఆర్‌సి పట్టణ కో-ఆర్డినేటర్ వేణు, ప్రిన్సిపల్ కె.సుధాకర్ పర్యవేక్షించారు.

27 నుంచి ఉచిత యోగా శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానం ఆవరణలో శ్రీరాధాకృష్ణ యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ నుండి ఉచిత యోగా శిక్షణా శిబిరం ప్రారంభమవుతుందని యోగా సేవ కేంద్రం వ్యవస్థాపకులు, ప్రధాన యోగా చార్యులు పడమట రాధాకృష్ణ యోగి గురూజీ తెలిపారు. మూడు వారాల పాటు జరిగే శిబిరంలో యోగాసనంలు, ప్రాణాయామము, ధ్యానములలో శిక్షణిస్తామని చెప్పారు. యోగ శిక్షణ ద్వారా ఆందోళన, గుండె దడ, కండరాల నొప్పులు, నరాల బలహీనత, శ్వాసకోశ సంబంధమైన వ్యాధులు, మహిళలకు రుతుక్రమ దోషాలు తదితర 72 రకాల దీర్ఘకాలిక వ్యాధులు మటుమాయం అవుతాయన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

(మొదటి పేజీ తరువాయి)

అధికారి కె.శ్రీనివాస్‌ను గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ సన్మానించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై ఇన్ఫర్మేషన్ బ్యూరో రూపొందించిన పుస్తకాలను గవర్నర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. తొలుత పౌర సరఫరాల శాఖ, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, ఆరోగ్య శాఖ ఆయుష్మాన్ భారత్, టీబీ స్క్రీనింగ్, ఎలిమినేషన్, నెహ్రూయువకేంద్రం, గ్రామ వార్డు సచివాలయ శాఖ, మై భారత్ వాలంటీర్ ఎన్రోల్మేంట్, ఆధార్ క్యాంప్, వ్యవసాయ శాఖ భూసార పరీక్షలు, తదితర అంశాలపై ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను గవర్నర్ సందర్శించారు. కార్యక్రమంలో గృహనిర్మాణం, గ్రామ, వార్డు సచివాలయాల స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, కేంద్ర ప్రభుత్వ రాష్ట్ర ప్రభరి అధికారి పీయూష్ కుమార్, గుంటూరు రేంజ్ ఐజి పాల్‌రాజు, ఎంపి అయోధ్య రామిరెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, జేసీ రాజకుమారి, ఎమ్మెల్యేలు మేకతోటి సుచరిత, మద్దాళి గిరిధర్, నగర మేయర్ కావటి మనోహరనాయుడు, జీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ ఆర్.సీతారామంజనేయులు పాల్గొన్నారు.


లాల్‌పురం స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావును సన్మానిస్తున్న గవర్నర్

108 ఉద్యోగుల సంఘం పల్నాడు జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నూతనంగా ఎంపికైన కమిటి 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ సిలార్ మసూద్ అన్నారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో 108 ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) జిల్లా సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. సమావే శానికి షేక్ గౌస్ అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా కోశాధికారి డి శివకుమారి, సిలార్ మసూద్ పర్యవేక్షణలో యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పాపారావు, ఉపాధ్యక్షులుగా ప్రభాకరరావు, ఎం.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా శరత్, సహాయ కార్యదర్శులుగా షేక్ గౌస్, చినబాబు, కోశాధికారిగా వెంకటరమణ, సభ్యులుగా రమేష్, సుబ్బారావు, రాంబాబు, బ్రహ్మానాయుడు, విజయ్, అంజినాయక్ , అమీర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శివకుమారి మాట్లాడుతూ ఎక్కడైనా రోడ్డు ప్రమాదం వాటిల్లితే సమాచారం తెలిసిన వెంటనే హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుల ప్రాణాలు కాపాడే 108 ఉద్యోగుల సేవలు నిరుపమానమన్నారు. అయితే వీరి సమస్యలు ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 108 ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ప్రమాద స్థలానికి హడావుడిగా వెళ్లే క్రమంలో ప్రమాదాలకు గురై మృతి చెందిన ఘటనల్లో ఉద్యోగుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. కార్మిక, కర్షక, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల27, 28 తేదీల్లో విజయవాడలో నిర్వహించే మహాధర్నాలో 108 ఉద్యోగులూ భాగస్వామ్యం కావాలని, అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు కరపత్రాలను ఆవిష్కరించారు.


మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నూతన కమిటీ

చిన్నారుల అదృశ్యం కలకలం

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం అటు పోలీసుల్లోనూ, బాధిత కుటుంబాల్లోనూ సంతోషం నింపింది. పట్టణంలోని చినరావూరుతోట పోతురాజు కాలనీలో నివాసం ఉండే పంది మాల్యాద్రి, సుమలత దంపతుల 13 ఏళ్ల కుమార్తె రాధిక, ఎనిమిదేళ్ల కుమారుడు రాఘవేంద్ర, అదే ప్రాంతానికి చెందిన షేక్ జాని కుమారుడు తొమ్మిదేళ్ల అల్తాఫ్, షేక్ బాషా కుమారుడు ఏడేళ్ల ఆరిఫ్ శుక్రవారం అదృశ్యమయ్యారు. ఉదయం లేవగానే ఆడుకునే నిమిత్తం ఇంటి నుంచి బయటకు వచ్చిన వీరు దాదాపు ఏడున్నర నుంచి కనిపించకుండా పోయారని బాధిత కుటుంబీకులు చెబుతున్నారు. వీరంతా స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల్లో చదువుతున్నారు. మాల్యాద్రి, సుమలత దంపతులు ప్రకాశం జిల్లా కనిగిరి ప్రాంతానికి చెందిన వారు. దాదాపు ఆరు నెలల క్రితం కూలి పనుల నిమిత్తం వలస వచ్చి, పోతురాజు కాలనీలో ఉంటున్నారు. యథావిదిగా ఉదయాన్నే వీరు రూరల్ గ్రామం కొలకలూరుకు కూలి పనుల నిమిత్తం వెళ్ళారు. తిరిగి వచ్చే సరికి పిల్లలు కనిపించకపోవటంతో ఆ ప్రాంతంలో గాలించారు. అదే సమయంలో అల్తాఫ్, ఆరిఫ్ కూడా కనిపించటంలేదనే సమాచారంతో ఆ ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ఒకేదఫా నలుగురు చిన్నారులు అదృశ్యం మిస్టరీగా మారింది. బాధితులు పట్టణ ఒన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. అదృశ్యమైన చిన్నారుల్లో ఆరిఫ్ తండ్రి బాష ఆటో డ్రైవర్. అల్తాఫ్ తండ్రి జాని కూలి పనులకు వెళు తుంటారు. పిల్లలు అదృశ్యం కావటంతో ఆ ప్రాంతంలో విషాదం అలముకుంది. కాగా అల్తాఫ్, ఆరిఫ్ ఉదయం ఆడు కోవటానిక ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని తల్లిదండ్రులు చెబుతున్నారు. అదృశ్యమైన మరో బాలిక రాధికను మాత్రం మధ్యాహ్నం సమయంలో ఆ ప్రాంతంలో స్థానికులు చూసినట్లు చెబు తున్నారు. బాధితులతో పాటు స్థానికులు పెద్ద ఎత్తున పట్టణ ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




బాధితులతో మాట్లాడుతున్న సిఐ చంద్రశేఖర్

పిల్లల ఆకతాయి తనమే.. అంతా క్షేమం

కె.చంద్రశేఖర్, సిఐ, ఒన్‌టౌన్, తెనాలి

అంతా సేఫ్..ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఘటన వెనుక ఎలాంటి కుట్రకోణం లేదు. ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే గాలింపు చేపట్టాం. ఎట్టకేలకు ఆచూకి లభించింది. నలుగురూ విజయవాడ పార్కుకు వెళ్లారు. సాయంత్రం వరకూ అక్కడే ఉన్నారు. సమాచారం తెలుసుకుని విజయవాడ వెళుతున్నాం. మరికొద్ది సేపట్లో పిల్లలను తెనాలి తీసుకువస్తాం. తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగిస్తాం.

మార్చిలో వర్సిటీలో అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎంబిఎ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో మార్చి 15, 16, 17 తేదీలలో నిర్వహించబోయే ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ ఆపర్చునిటీస్ ఇన్ హెల్త్ కేర్ మేనేజ్మెంట్ అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు యొక్క కర్టెన్ రైజర్ పోస్టర్‌ను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పట్టేటి రాజశేఖర్ చేతుల మీదుగా ఆవిష్కరణ జరిగినది. ప్రస్తుత అంతర్జాతీయ%శీ%గా మరియు భారత దేశంలో నూ ప్రత్యేకంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర%శీ% లో వైద్య, పరిశోదన , హాస్పిటల్స్ నిర్వహణ, యాజమాన్యం లలో వస్తున్న పరిశోధనలు మార్పులు మరియు అవకాశాలు గురించి ఈ యొక్క సదస్సు విస్తతంగా చర్చించనున్నది. ఈ మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మరియు యుజిసి సహకారంతో ఎంబిఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం నిర్వహిస్తున్నారు.. ఈ మూడు రోజుల సదస్సుకు దేశ విదేశాల నుండి ప్రముఖ వైద్య నిపుణులు, వైద్య పరిశోధకులు, ఫార్మాసూటికల్ రంగ నిపుణులు, మరియు వివిధ కార్పొరేటర్ హాస్పిటల్స్ నిర్వాహకులు, విశ్వవిద్యాలయ పరిశోధనా, విద్యార్థులు మేనేజ్మెంట్ రంగ విద్యార్థులు, మరియు పరిశోధకులు అందరూ కూడా పాల్గొనవచ్చని ఈ సదస్సు డైరెక్టర్ డాక్టర్ బట్టు నాగరాజు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెక్టర్ ప్రొఫెసర్ పి. వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బీ. కరుణ, డాక్టర్ కే . అబ్రహాం లింకన్, విభాగం అధ్యాపకులు డాక్టర్ పి శ్రీనివాస్, డాక్టర్ చుండి ప్రసాద్, డాక్టర్ యస్ కే. సదిఖ్, డాక్టర్ బి. శ్రీధర్ రెడ్డి, జి. డేవిడ్ రాజు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారంలో పెరుగుతున్న స్వచ్ఛంద సంస్థల పాత్ర

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డిపార్ట్మెంట్ ఆఫ్ సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగంలో వచ్చే ఏడాది మార్చి 1, 2 తేదీల్లో జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు విభాగాధిపతి ఆచార్య వి.వెంకటేశ్వర్లు తెలియజేశారు. సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ పి .రాజశేఖర్ ఆధ్వర్యంలో విడుదల చేయడం జరిగింది. నెట్వర్కింగ్ అండ్ ఇంటర్ ఫేసింగ్ ఆఫ్ నాన్ గవర్నమెంటల్ ఆర్గనైజేషన్స్ ఫర్ కన్వర్జేన్స్ ఇన్ సోషల్ యాక్షన్ అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సమస్యలను పరిష్కరించుటలో స్వచ్ఛంద సంస్థల పాత్ర గణనీయంగా పెరుగుతుందని వాటి యొక్క ఆవశ్యకత ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రాముఖ్యత సంతరించుకున్నదని వివరించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ పి.వరప్రసాద్ మూర్తి, రిజిస్టార్ ప్రొఫెసర్ బి.కరుణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్. స్వరూపరాణి, విభాగ అధ్యాపకులు ప్రొఫెసర్ త్రిమూర్తిరావు, ప్రొఫెసర్ ధనలక్ష్మి, ప్రొఫెసర్ సరస్వతి రాజు అయ్యర్, ప్రొఫెసర్ దివ్య తేజ మూర్తి, డాక్టర్ బి.నాగ రాజు, గెస్ట్ ఫ్యాకల్టీ డాక్టర్ రాజ్ కుమార్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మతుకుమల్లిలో మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి - వినుకొండ

శావల్యాపురం మండలంలోని మతుకుమల్లిలో వినుకొండ నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కొంజేటి నాగశ్రీను, శావల్యాపురం మండల అధ్యక్షులు అడపాల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కాటూరి మెడికల్ హాస్పిటల్ సహకారంతో శుక్రవారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈసీజీ, అనగా గుండె పరీక్షలు, షుగరు, బిపి, చెవి, ముక్కు, గొంతు, కంటి వైద్య పరీక్షలు చేశారు. శుక్లము ఆపరేషన్ కోసం బస్సు ఏర్పాటు చేశారు. నాయకులు యుసఫ్ పటాన్, రాజబాబు, యాదాల వెంకటేష్, కామిశెట్టి కిశోర్, అనిల్, బాజీ,గోపి చిరంజీవి, తిరుమల పాల్గొన్నారు.



చోరీ కేసుల్లో నిందితుడు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సిఐ, ఎస్ఐ, వెనుక ముసుగులో నిందితుడు

ప్రజాశక్తి - తెనాలి

ఒకేరోజు మూడు ఆలయాలలో చోరీకి పాల్పడిన నిందితుడిని పట్టణ టు టౌన్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సిఐ కె వెంకట్రావు వివరాలను వెల్లడించారు. మైనర్ గా ఉన్నప్పుడు నుంచి నేర ప్రవర్తన కలిగి, జల్సాలకు అలవాటు పడిన పల్నాడు జిల్లా, రాజుపాలెం మండలం, బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన తమ్మిశెట్టి గోపి పోలీసుల రికార్డులలో పాత నేరస్థుడు. ఈనెల 18న పట్టణ 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎరువులకొట్ల బజారులో ఓ బైకును అపహరించాడు. ఆ బైకుతో పట్టణంలో సంచరిస్తూ ఈనెల 22న తెల్లవారుజామున రజకచెరువు కూడలిలోని సీతారామ కళ్యాణ దేవస్థానం, ఆంజనేయ స్వామి గుళ్ళలో ప్రవేశించి హుండీలలోని రెండువేల నగదును అపహరించాడు. చోరీపై స్థానికుడు భీష్మ పాములు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. పాత నేరస్తులపై దష్టి సారించిన పోలీసులు విచారణలో తమ్మిశెట్టి గోపిని నిందితుడిగా గుర్తించారు. గోపి గతంలో మైనర్ గా ఉన్నప్పుడే అత్యాచారం కేసులో జువైనల్ హెూమ్ లో మూడు నెలలు జైలు శిక్ష అనుభవించాడు. అలాగే అంగలకుదురులో బైక్ అపహరణ కేసులోనూ జైలుకు వెళ్లాడు. కాకినాడలో ఓ మహిళ మెడలో గొలుసును అపహరించిన కేసులోనూ నిందితుడే. దొంగతనాల ద్వారా వచ్చిన సొమ్ముతో జల్సాలకు అలవాటు పడుతూ నేరాలకు పాల్పడుతున్నట్లు సిఐ వెల్లడించారు. అతని నుంచి పట్టణంలో అపహరణకు గురైన బైకును, రూ. 520 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎస్ఐ పి నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



28న బిసిల అఖిలపక్ష రౌండ్ టేబుల్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంతో కూడిన పాలన కాకుండా నిత్యం ప్రత్యర్థులపై దాడులు చేయడంమే లక్ష్యంగా కక్షసాధింపు పాలన జరుగుతుందని టిడిపి జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్కుమార్ ఆరోపించారు. గుంటూరులోఈనెల 28న బిసి రౌండ్ టేబుల్ సమావేశంకు సన్నాహక సమావేశం శుక్రవారం టిడిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా బిసి విభాగం అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. బిసి రౌండ్ టేబుల్ సమావేశం పరిశీలకులు ఉప్పుటూరి పేరయ్య హాజరయ్యారు. తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ బిసి అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బిసిలపై కక్ష సాధింపులు, దాడులు, హత్యలు ఎక్కువయ్యాయని తెలిపారు. తెలుగుదేశం మద్దతుదారులుగా ఉన్నారని అనేకమంది బీసీలపై వైసిపి నాయకులు దాడులకు పాల్పడ్డారని తెలిపారు. ఈనెల 28వ తేదీన అఖిలపక్ష బిసి రౌండ్ టేబుల్ సమావేశం ఎన్జీవో కల్యాణ మండపంలో జరుగును.. తెలుగుదేశం పార్టీ నుండి మాజీ మంత్రులు యనమల రామకష్ణుడు, కొల్లు రవీంద్ర తదితరులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో టిడిపి నాయకులు నిమ్మల శేషయ్య, సింహాద్రి కనకాచారి, మద్దిరాల గంగాధర్, మల్లెల ఈశ్వరరావు, దేవేళ్ళ మల్లిఖార్జునరావు, ధూళిపాళ్ళ ఏసుబాబు, కావేటి వేణుగోపాల్, వంగర ఏడుకొండలు, మాదాల చిన కొండలరావు, గట్టి శ్రీనివాసరావు, తుమ్మేటి మురళి, నీలాల కష్ణారావు పాల్గొన్నారు.



విద్యుత్ స్తంభం పైనుండి పడి కాంట్రాక్ట్ కార్మికునికి గాయాలు

ప్రజాశక్తి - మాచర్ల : స్థానిక పురపాలకశాఖ కార్యాలయంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడు తిరుమలకొండ నరసింహరావు విద్యుత్ స్థంభంపై నుండి పడి తీవ్ర గాయాలపాలైన ఘటన శుక్రవారం జరిగింది. యాదవల బజారులోని విద్యుత్ స్థంభానికి లైట్ వెలగకపోవటంతో దానిని రిపేరు చేసేందుకు నరసింహరావు స్థంభంపైకి ఎక్కినాడు. స్థంభం విరిగిపడటంతో నరసింహరావు పై నుండి క్రింద పడిపోయాడు. 108 ద్వారా నరసింహరావును ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రధమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నర్సరావుపేటకు తరలించారు. వార్డు కౌన్సిలర్ మున్నా మురళి, యాదవ్ కార్పోరేషన్ డైరక్టర్ కామనబోయిన కోటయ్యలు నరసింహరావును ప్రభుత్వ వైద్యశాలలో పరామర్శించి రూ5వేలు ఆర్ధిక సహయం అందించారు. పట్టణంలోని విద్యుత్ స్థంభాల పటిష్టతపై అధికారులు పరిశీలన జరపాలని, ఒరిగిపోయిన, ఇరిగిపోయిన స్థంభాల స్థానంలో నూతన స్థంభాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సచివాలయాలా? వైసిపి కార్యాలయాలా?

జాతీయ జెండా దిమ్మెకు వైసిపి రంగులా ? : టిడిపి నేత జూలకంటి బ్రహ్మరెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల



మాచర్ల మండలం, చింతలతండా గ్రామంలో జాతీయ జెండా దిమ్మెకు వైసిపి రంగులు వేయటం కోర్టు దిక్కరణతో పాటు రాజ్యాంగాన్ని అవమానించ టమేనని తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి జూలకంటి బ్రహ్మరెడ్డి అన్నారు. శుక్రవారం బ్రహ్మరెడ్డి విలేఖరులతో మాట్లాడుతూ భారతదేశానికి అత్యంత పటిష్టమైన రాజ్యాంగం ఉన్నదని అన్నారు. సదరు రాజ్యాంగానికి లోబడి అందురు నడుచుకోవాలన్నారు. కాని మాచర్లలో కొత్త రాజ్యాంగం అమలు ఆవుతుందా అని అనిపిస్తుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో జాతీయ జెండా తప్ప పార్టీ జెండాలను ఎలా ఎగురవేస్తారని, జాతీయ జెండా దిమ్మెకు పార్టీ రంగులు పూసి మరి పార్టీ జెండాలను ఎగురవేయటం ఏమిటి అని ప్రశ్నించారు. హైకోర్టు ప్రభుత్వ కార్యాలయాలకు పార్టీ రంగులు వేయవద్దని చెప్పినా, ఇక్కడ నాయకులకు కోర్టులపై ఏ మాత్రం గౌరవం లేదన్నారు. సంక్షేమ కార్యక్రమాల ప్రచారం పేరుతో పార్టీ కార్యక్రమాలు చేపడుతూ అందులో అధికారులను భాగస్వాములను చేయటం సిగ్గుచేటు అని అన్నారు. ఆయా కార్యక్రమాలలో పాలుపంచుకుంటున్న అధికారులు తమ మనస్సాక్షిని ప్రశ్నించుకోవాలని బ్రహ్మరెడ్డి సూచించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - పెదకూరపాడు

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పెదకూరపాడు ఎస్ఐ వెంకటరావు అన్నారు. శుక్రవారం పెదకూరపాడు మండలంలోని హుస్సేన్నగరం గ్రామాల్లో పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు దిశా యాప్ ను డౌన్లోడ్ చేసుకొని వినియోగించుకోవాలన్నారు. చట్ట ప్రకారం నడుచుకోవాలని కోరారు. గ్రామ పెద్దలు నాయకులు ప్రజలు పాల్గొన్నారు.



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	: 21,542
మిర్చి ఎగుమతి	: 21,962
మిర్చి నిల్వ	: 10,305

మిర్చి ధరలు

రూపాయలలో

334	8,500 - 22,000
341	10,000 - 23,000
నాన్ ఎసి	
తేజ	8,500 - 23,100
బడిగి	11,500 - 24,000
దేవనూరు డీలక్స్	14,000 - 20,000
తాలుకాయలు	6,500 - 11,000
ఎసి	
334	15,000 - 21,500
నెం.5	---------------
341	13,000 - 19,500
తేజ	10,500 - 22,000
బడిగి	9,000 - 24,500
దేవనూరు డీలక్స్	14,500 -17,500
తాలుకాయలు	5,500 -11,000

ఆలపాటి పెళ్లికానుక అందజేత

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి మండలం అంగల కుదురు గ్రామానికి చెందిన షేక్ ముమ్ముషా, ఖుషీదా దంపతుల కుమార్తె ఖాసీంబీ వివాహం సందర్భంగా ఆమెకు ఆలపాటి రాజేంద్రప్రసాద్ గారు పంపిన పెళ్లి కానుక అందజేశారు. చీర, సారెతో పాటు మంగళసూత్రం బహుకరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజ్యలక్ష్మి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కనగాల శ్రీను, సూర్యదేవర వెంకట్రావు, జెట్టి రేణుక, నలుకుర్తి విజయ, భవాని తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎపిజిఎల్ఐ కొత్త బాండ్లు విడుదల చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఎపిజిఎల్ఐ కొత్త బాండ్లు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. ఈమేరకు శుక్రవారం సంఘ నాయకులు ఎపిజిఎల్ఐ సంయుక్త సంచాకులు డి.అశోక్ను కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ ఏడాది జూన్ 26 నుండి నిలిచిపోయిన ఎపిజిఎల్ఐ యాప్ను పునరుద్ధరణ చేసి ఉద్యోగులకు, ఉపాధ్యాయలకు ఎపిజిఎల్ఐ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. దీనివలన ఉద్యోగులకు ఋణాలు, క్లెయిమ్ పొందటానికి అవకాశం ఉంటుందన్నారు. కనుక తక్షణమే ప్రభుత్వ దష్టికి తీసుకెళ్లి ఎపిజిఎల్ఐ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. సంయుక్త సంచాలకులు స్పందిస్తూ డిసెంబర్లో కొత్త బాండ్లు వచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్బాషా, జిల్లా ఉపాధ్యక్షులు పోతురాజు, రవికుమార్, మురళీ, నగర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, నగర ఉపాధ్యక్షులు రాధాకష్ణ, సిద్దార్ధ, సంయుక్త కార్యదర్శులు భరత్కుమార్, కనకారావు, దక్షిణామూర్తి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

జీవన నైపుణ్యాలపై జెకెసిలో శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

రూబికాన్ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా స్థానిక జెకెసి కాలేజిలో విద్యార్థులకు జీవన నైపుణ్యాలు, ఉద్యోగ నైపుణ్యాలు, మేధో నైపుణ్యాల అభివృద్ధిపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో రవిరాజు, షేక్. మస్తాన్, లక్ష్మీ పాల్గొని నాలుగు రోజులపాటు శిక్షణ ఇచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు తెలియజేశారు.

'టిడిపితోనే పేదలకు మేలు'

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి



టిడిపి అధికారంలోకి వస్తే పేదలకు మేలు జరుగుతుందని పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జి ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర అన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 20వ డివిజన్ సంపత్ నగర్ 5 వ లైన్ ప్రాంతంలో రవీంద్ర, జనసేన గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయ కర్త బోనబోయిన శ్రీనివాస్ యాదవ్తో కలిసి 'బాబుష్యూరిటీ - భవిష్యత్తు కు గ్యారెంటీ' కార్యక్రమం జరిగింది. ఇంటింటికి తిరిగి రిజిస్ట్రేషన్ చేసి మేనిఫెస్టో గురించి అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్లి మహిళలు, యువతతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. నగరంలో మినీ మేనిఫెస్టో కరపత్రాలను అందజేసి తెదేపా అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సంక్షేమ పథకాలు మహాశక్తి, యువగళం, అన్నదాత, ఇంటింటికీ నీరు, పూర్ టు రిచ్, బీసీ రక్షణ చట్టం గురించి వివరించారు. చంద్రబాబు ఒక విజన్ ఉన్న నాయకుడని.. రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు మళ్లీ సీఎం కావాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో తెదేపా గెలుపు అత్యవసరమన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు నిమ్మల శేషయ్య, కనకాచారి, సుఖవాసి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - దాచేపల్లి

విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిరంతరం పోరాడుతోందని జిల్లా కార్యదర్శి కె.సాయికుమార్ అన్నారు. ఎస్ఎఫ్ఐ మండల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ మండలంలో ఉన్న విద్యార్థి బస్సు సమస్యలు, హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. మండలం విద్యారంగంలో ముందుండాలంటే మహిళ జూనియర్, డిగ్రి కళాశాల, ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఏర్పాటు చేయాలి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా 20 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా నరేంద్ర, విక్రమ్, ఉపాధ్యక్షులుగా గోవింద్, ప్రసాద్, సహాయ కార్యదర్శులుగా శ్రీనివాస్, మీరాస, సభ్యులుగా రాజేష్, రవి, బషీర్, రామ సైదయ్య మార్క్, సాయి ఎన్నికయ్యారు.



యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - దుర్గి

యుటిఎఫ్ పల్నాడు జిల్లా కౌన్సిల్ మహాసభ పోస్టర్‌ను మండల కేంద్రమైన దుర్గిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్)లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ నిరంతరం పోరాడుతోందని చెప్పారు. ఈ క్రమంలో విద్యారంగంలో పరిణామాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు నియోజకవర్గ కేంద్రమైన గురజాలలోని చల్లగుండ్ల గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించే జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని కోరారు.



కెసిపి మైన్స్ భద్రతా చర్యలు అభినందనీయం

భద్రతా పరిశీలన బృందం సభ్యులు విజయకుమార్

ప్రజాశక్తి - మాచర్ల

గనుల భద్రత వారోత్సవాల సందర్భంగా మైన్స్ ఇన్‌స్పెక్షన్ బృందం శుక్రవారం స్థానిక కెసిపి సిమెంట్ ఫ్యాక్టరీ గనులను పరిశీలించారు. కెసిపి సిమెంట్ యాజమాన్యం చేపడుతున్న భద్రత చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సేఫ్టీ వారోత్సవాల సమావేశానికి కెసిపి సీనియర్ జనరల్ మేనేజర్ రమణ అధ్యక్షత వహించారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ కెసిపి సిమెంట్ ఫ్యాక్టరీలో ప్రమాదాలు జరగకుండా ప్రమాద రహిత పరిశ్రమగా గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. మేనేజర్ రమణ మాట్లాడుతూ భద్రతకు కెసిపి పెద్దపీట వేస్తోందని, భద్రతతో పాటు పర్యావరణాన్ని కాపాడేందుకూ ప్రత్యేక చర్యలు చేపడుతోందని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్షన్ బృంద సభ్యులు విజయకుమార్, రామాంజనేయరెడ్డి, అశోక్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆవేదనలో అంగన్వాడీలు

- అరకోర జీతాలతో కష్టమవుతున్న కుటుంబ జీవనం
- పని ఒత్తిడితో సతమతం - బిల్లుల పెండింగ్‌తో అప్పుల భారం



ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రభుత్వ ఉద్యోగి అనే పేరుతో సంక్షేమ పథకాలను దూరం చేస్తూ జీతం ఇచ్చేటప్పుడు మాత్రం అత్తెసరు మొత్తంతో ప్రభుత్వాలు సరిపెడుతున్నాయి. ఇచ్చేదే అరకొర వేతనాలైతే బకాయిలనూ నెలల తరబడి పెండింగ్ పెడుతున్న కారణంగా వడ్డీలకు అప్పులు తేవాల్సిన దుస్థితిలో అంగన్వాడీలున్నారు. దీనికితోడు అదనపు పనులనూ రుద్దుతూ తీవ్ర ఒత్తిళ్లకు గురి చేస్తున్నారు.

చిలకలూరిపేట నియోజకవర్గంలో 260 మంది అంగన్వాడీ టీచర్లు, అంతే సంఖ్యలో అంగన్వాడీ ఆయాలు(హెల్పర్లు)న్నారు. టీచర్‌కు రూ.11,500, ఆయాలకు రూ.7 వేలు చొప్పున వేతనాలిస్తున్నారు. ఇవి కుటుంబ పోషణకు ఏ మాత్రమూ సరిపోవడం లేదు. తెలంగాణలో కంటే అదనంగా రూ.వెయ్యి ఇస్తామనే హామీని సిఎం విస్మరించారు. మరోవైపు అద్దె భవనాల్లో నిర్వహించే సెంటర్ అద్దెలు, కూరగాయలు, గ్యాస్, కరెంటు బిల్లులను ప్రభుత్వం నెలల తరబడి పెండింగ్ పెడుతోంది. ప్రభుత్వం చెల్లించే వరకూ ఆ భారాన్ని అంగన్వాడీలే భరించాల్సి వస్తోందని, ఇందుకుగాను వడ్డీలకు అప్పులు తెచ్చి సెంటర్లను నిర్వహిస్తున్నారు.

పని భారం..

ప్రతినెలా 1-5 తేదీల్లో మూడేళ్లలోపు పిల్లలకు ఎత్తు, బరువు కొలిచి వాటిని యాప్‌లో నమోదు చేయాలి. సాధారణ రికార్డుల్లోనూ రాయాల్సి ఉంటుంది. అంగన్వాడీ కేంద్రాలకు రాలేని పిల్లల తల్లులను పిలిపించుకుని పిల్లల కొలతలు తీసుకోవడం, వాటిని రెండుసార్లు నమోదు చేయాల్సి రావడం అంగన్వాడీలకు పని భారంగా మారింది. దీనికితోడు కమ్యూనిటీ బేస్డ్ ఈవెంట్స్ అంటూ నెలకు రెండుమూడు సార్లు నిర్వహించాలని ఉన్నతాధికారుల నుండి అంగన్వాడీలకు ఒత్తిళ్లు వస్తున్నాయి. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహనలు తదితర కార్యక్రమాల నిర్వహణకు జన సమీకరణ భారమూ అంగన్వాడీలకు శిరోభారంగా మారింది. ఈ కార్యక్రమ నిర్వహణ కింద ప్రతి అంగన్వాడీకి ఒక్కో కార్యక్రమానికి రూ.250 చొప్పున ఇస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా అవి తమ ఖాతాల్లో జమ కావడం లేదని అంగన్వాడీలంటున్నారు.

దక్కని రిటైర్‌మెంట్ బెనిఫిట్స్

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఏళ్ల తరబడి సేవలు చేసిన అంగన్వాడీలు హుందాగా రిటైర్ కావడానికి, విశ్రాంత జీవితం గౌరవ ప్రదంగా జీవించడానికి వీల్లేకుండా పోయింది. ప్రస్తుతం రిటైర్ అయిన టీచర్‌కు రూ.50, హెల్పర్‌కు రూ.20 వేలు ఇస్తున్నారు. అయితే వీటిని వెంటనే ఇవ్వకుండా పెండింగ్‌లో పెడుతున్నారు. కావూరు సెక్టార్‌లో పని చేస్తూ ఏప్రిల్‌లో రిటైర్ అయిన పద్మావతి అనే టీచర్‌కు రూ.50 వేలు, గణపవరంలో పని చేస్తూ రిటైర్ అయిన డి.మరియమ్మ అనే హెల్పర్‌కు రూ.20 వేలు ఇంకా రాలేదు. తూబాబు సెక్టార్‌కు చెందిన కె.జోత్స్న పరిమళ అనే టీచర్ 8 నెలల కిందట రిటైర్ అయినా బెనిఫిట్ దక్కలేదు. మరోవైపు రిటైర్ అయిన టీచర్ స్థానంలో అర్హులైన హెల్పర్‌కు ప్రమోషన్ ఇవ్వడం లేదు. నియామకాల్లోనూ జాప్యం వల్ల ఉన్నవారిపైనే మిగతా పనిభారమూ పడుతోంది.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

పి.వెంకటేశ్వర్లు, డివిజన్ గౌరవాధ్యక్షులు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్.

అంగన్వాడీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలి. సిగ్నల్ సమస్య వల్ల యాప్‌లలో వివరాల నమోదు కష్టంగా ఉంది. సొంత భవనాలున్న చోట రెండు సెంటర్లను కలిపి నిర్వహించాలని అధికారులు చెబుతున్నారు. దీనివల్ల సమస్యలు వచ్చి పిల్లలు కేంద్రానికే రావడం లేదు. లబ్ధిదారులే వచ్చి రేషన్ తీసుకెళ్లాలని చెప్పడం, ముఖ ఆధారిత యాప్‌ను పెట్టడం వల్ల సిగ్నల్ సమస్యతో ఇబ్బందులు వస్తున్నాయి. గతంలో ఇళ్లకే రేషన్ తీసుకెళ్లే విధానం ఉండేది. దీన్ని కొనసాగించాలి. ఇలా అంగన్వాడీలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27, 28 తేదీల్లో విజవాడలో నిర్వహించే మహాధర్నాకు కార్యకర్తలంతా తరలిరావాలి

27, 28 తేదీల్లో మహాధర్నాకు తరలిరండి

ప్రజాశక్తి - వినుకొండ

కార్మికులు, కర్షకుల సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో, రైతు, కార్మిక అఖిల పక్షాల సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించే మహా ధర్నాను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలో శుక్రవారం మైకు ప్రచారం చేపట్టారు. సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రాము ప్రచారాన్ని ప్రారంభించి మాట్లాడుతూ వ్యవసాయన్ని దెబ్బతీసేలా, కార్మికుల హక్కులను హరించేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదని, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పి ఎరువుల ధరలను మూడు రెట్లు పెంచిందని మండిపడ్డారు. ఇంధన ధరలు విపరీతంగా పెంచారని, నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని విమర్శించారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలనే కేంద్రం ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఈ ఏడాది వర్షాభావం, నాగార్జున సాగర్ కుడి కాల్వకు నీరు విడుదల చేయని కారణంగా లక్షలాది ఎకరాల్లో పంటను వెయ్యని పరిస్థితి నెలకొందని, జిల్లాలో అనేక ప్రాంతాల్లో 1000 అడుగుల పైన బోర్లు వేసిన నీళ్లు రావడం లేదని చెప్పారు. ఈ సమస్యలేమీ ప్రభుత్వాలకు పట్టడం లేదన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం చేపట్టే ధర్నాకు ప్రజలు తరలిరా వాలని కోరారు. కార్యక్రమంలో బి.శ్రీనివాసరావు, బి.వెంకటేశ్వర్లు, కె.శివరామకృష్ణ, మల్లికార్జునరావు, ఎ.కోటేశ్వరరావు, ఖాసిం, ఎ.ఆంజనేయులు, ముని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



శాస్త్ర, సాంకేతికతతోనే మానవాభివృద్ధి

డార్విన్ జీవపరిణామ సిద్ధాంతాన్ని సిలబస్ నుండి తొలగించడం బాధాకరణం

ప్రజాశక్తి - మాచర్ల



మాట్లాడుతున్న జెవికెఎస్ ప్రసాద్

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మాచర్ల పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాల, ఎస్‌కెబిఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, ప్రతిభ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రపంచ పరిణామ దినోత్సవాన్ని నిర్వహించారు. కృష్ణవేణి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, జన విజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు వెంకట్రామయ్య మాట్లాడుతూ డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని మతంతో ముడిపెట్టొద్దని అన్నారు. సిద్ధాంతాన్ని సిలబస్ నుంచి తొలగించటం బాధాకరమన్నారు. ఎస్‌కెబిఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక జీవ పరిణామ సిద్ధాంతమే నేర్చుకొనడం కాదని, అన్ని రకాలైన పరిణామ సిద్ధాంతాలు విద్యార్థులు నేర్చుకోవాలని అన్నారు. మన శరీరంలో మెదడును బాగా ఉపయోగించినట్లయితే అది బాగా అభివృద్ధి చెందుతుందని, లేకుంటే డార్విన్ చెప్పినట్లు నిరుపయోగ అవయయముగా మారిపోతుందని వివరించారు. ప్రతిభ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ వెంకట నారాయణ మాట్లాడుతూ సైన్స్, టెక్నాలజీ వల్లనే మానవాభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం జన విజ్ఞాన వేదిక ఆశయాలను జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి జెవికెఎస్ ప్రసాద్ వివరించారు. డార్విన్ పరిణామ సిద్ధాంతంలోని ముఖ్యంశాలను గౌరవాధ్యక్షులు ఆదినారాయణ వివరించారు. జెవివి మాచర్ల పట్టణ అధ్యక్షులు, జువాలజీ లెక్చరర్ చిన్నదాసు, ఎస్‌కెబిఆర్ డిగ్రీ కళాశాల జువాలజీ లెక్చరర్ డాక్టర్ రాజశేఖర్, బోటనీ లెక్చరర్ కృష్ణవేణి, ప్రతిభ జూనియర్ కళాశాల బోటనీ లెక్చర ఆశాజ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

10వ రోజుకు పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

తమ కార్యాలయ భవనాన్ని ఆక్రమించిన పయనీర్ ఆటో మొబైల్స్ షాపు నిర్వాహకులు తక్షణమే ఖాళీ చేయాలని డిమాండ్ చేస్తూ పెన్షనర్లు చేపట్టిన ధర్నా శుక్రవారం 10వ రోజుకు చేరింది. తమ ధర్నాకు సహకరిస్తున్న అందరికీ పెన్షనర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే మద్దతుతో తాము పోరాడి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. తమ పోరాటం న్యాయమైందని, పయనీర్ ఆటో మొబైల్స్ షాపు యాజమాన్యం అక్రమంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ధర్నాలో బి.రామారావు, పురుషోత్తం, ఎం.జగన్నాథం, మల్లేశ్వరావు, వెంకట్రావు, వెంకటేశ్వర్లు, ఎ.ప్రభుదాస్, సుబ్బారావు, శృంగారం, మురహరిరావు, ఆంథోని, పోతులురయ్య, జీయలుద్దీన్, నాశరయ్య, బ్రహ్మయ్య, ఎంజిజె నాయుడు పాల్గొన్నారు.



ధర్నా శిబిరం లో పెన్షనర్లు

కార్మిక, కర్షకులకు బిజెపి విధానాలతో చేటు

విజయవాడలో రెండ్రోజుల ధర్నాను జయప్రదం చేయాలని నాయకుల విస్తృత ప్రచారం

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో 27, 28 తేదీలలో విజయవాడలో మహాధర్నాను జయప్రదం చేయాలని శుక్రవారం రైతు, కార్మిక సంఘాలు జిల్లాలో విస్తృత ప్రచారం, సమావేశాలు నిర్వహించారు.


గుండిమెడ ప్రచారంలో మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు


కొప్పురావూరు ప్రచారంలో మాట్లాడుతున్న ఎన్ శివాజి


పెదవడ్లపూడి ప్రచారంలో ఈమని అప్పారావు, వల్లూరి భారతి


ఫిరంగిపురం మండలంలో ప్రచారంలో పాల్గొన్న బైరగాని శ్రీనివాసరావు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధి గుండిమెడలో నిర్వహించిన విస్తృత ప్రచారంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు ప్రసంగించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వలన కార్మిక, కర్షకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నరేంద్ర మోడీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తూచా తప్పకుండా అమలు చేయడం దుర్మార్గమన్నారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో కూ రుకుపోయే విధంగా నరేంద్ర మోడీ చట్టాలను చేస్తుంటే దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాలు వ్యతిరేకించాయని ఆయన అన్నారు. అందులో భాగంగానే రైతులకు నష్టం కలిగించే, వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు పెట్టే ప్రక్రియ ను రాష్ట్రంలో అమలు చేయడం దుర్మార్గమన్నారు. దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసే విధంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆయన మండిపడ్డారు. వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చీమకుట్టినట్లైనా లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగాన్ని ఆదుకునేందుకు కేరళ రాష్ట్ర ప్రభుత్వం మాదిరి రైతు విమోచన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతిని వ్యవసాయ కూలీలకు పని దినాలు తగ్గిన క్రమంలో ఉపాధి పని దినాలను 200 రోజులకు పెంచాలని, పట్టణ ప్రాంతాలలో ఉపాధి హామీ అమలు చేయాలన్నారు. దేశవ్యాప్తంగా రైతులు, కార్మిక హక్కులను కాలరాస్తున్న బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, రైతులు, కార్మికులు, కౌలు రైతులు పెద్ద ఎత్తున మహా ధర్నాకు కదలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, పల్లె కృష్ణ, బత్తుల సంసోను, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

36 గంటలపాటు విజయవాడలోజరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని, మోడీ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక ,రైతు , ఉద్యోగ సంఘాల ఉమ్మడి ఆందోళనకు మద్దతు ఇవ్వవ్వాలని సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం రవి కోరారు. మండలంలోని ఎర్రబాలెంలో శుక్రవారం మున్సిపల్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా మార్చి కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వ విధానాలను కార్మికులు వ్యతిరేకించాలని కోరారు. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, రూ.26 వేలు జీతం ఇవ్వాలని అన్నారు. నూతన పెన్షన్ స్కీమును రద్దుచేసి, పాత పెన్షన్ పథకం పునరుద్ధరించాలని, కనీస ఈపీఎఫ్ పెన్షన్ రూ.9000 లు ఇవ్వాలని కోరారు. రద్దు చేసిన పాసింజర్ రైళ్లను, రైల్వే రాయితీలను పునర్ధరించాలని కోరారు. కార్మిక సంఘాల ఐక్యవేదిక, రైతు సంఘాల సమన్వయ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 27 ,28 తేదీల్లో విజయవాడ జింఖానా గ్రౌండ్స్ లో జరిగే మహా ధర్నా లో కార్మికులు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని రవి కోరారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ :విజయవాడలో మహా ధర్నా జయప్రదం చేయాలనివ్యకాస జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వల్లూరి భారతి పిలుపిచ్చారు. శుక్రవారం మండలంలోని పెదవడ్లపూడిలో విస్తృతంగా నిర్వహించిన ప్రచారంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరణ చేస్తూ వ్యవసాయాన్ని సంక్షోభం లోని నెడుతూ రైతుల ఆత్మహత్య కారణం అవుతుందని తెలిపారు .రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా పార్లమెంట్లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు . రైతులకు ,పేదల పాలిట ఉరితాడు కాగల ఎలక్ట్రిసిటీ బిల్లును ఉపసంహరించాలని ఇప్పటికే ఉన్న 24 కోట్ల మీటర్లను తొలగించారని ఇది సరైనది కాదని అన్నారు నేడు కౌలు రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి స్కేల్ ఆ ఫ్ ఫైనాన్స్ క్రింద పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులకు పనులు లేక అనేక ఇబ్బందులు పడుతూ సుదూర ప్రాంతాలకు వలస పోతున్నారని ఈ వలసలను అరికట్టేందుకు వామపక్ష పార్టీల మద్దతుతోటి తీసుకువచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తూ నిధులు తగ్గించేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి నిధులు పెంచి కనీస వేతనం 600 రూపాయలు ఇచ్చి సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోటిలింగం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని రూరల్

విజయవాడ ధర్నాలో కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజి తెలిపారు. శుక్రవారం మండలంలోని కొప్పురావూరులో ఎపి గ్రామపంచాయతి ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ సమావేశం శివాజి ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు వేస్తున్నాయని, ధరలు నియంత్రించాలని, ఆహారం మందులు వ్యవసాయ ఉపకరణాలపై జీఎస్టీ రద్దు చేయాలని,పెట్రోల్ డీజిల్ గ్యాస్ పై ఎక్సైజ్ పన్నులు తగ్గించాలని తదితరాలు సాధించుకోవాలంటే ఆందోళనే మార్గమని శివాజి తెలిపారు. 27న విజయవాడ ధర్నాలో పాల్గొనాలని పిలుపిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కే. సత్యనారాయణ, వెంకటయ్య సుబ్బయ్య, ఎలిషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం :విజయవాడ ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలో పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. వేములూరుపాడు, అమీనాబాద్, 113 తాళ్లూరు, ఎర్రగుంట్లపాడు, బేతపూడి గుండాలపాడు, మునగపాడు తక్కెళ్ళపాడు గ్రామాలలో నిర్వహించిన మైకు ప్రచారంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు ప్రసంగించారు. సాగర్ ఆయుకట్ట ప్రాంతంలో ఉన్న మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని, హరిత రాయబారులకు నాలుగు నెలలుగా జీతాల్లేవని వేంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మార్పుల వెంగళరెడ్డి, షేక్ మస్తాన్ వలి, ఫణి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మంగళగిరి

బిజెపి ప్రభుత్వం ప్రజా హక్కులను కాలరాస్తూ అప్రజాస్వామిక, అవినీతి, మతతత్వ , బీజేపీని రాబోయే ఎన్నికల్లో ఓడించే లక్ష్యసాధనలో భాగంగా ఈ నెల 27, 28 తేదీలలో విజయవాడలో జింఖానా గ్రౌండ్లో నిర్వహించే మహాధర్నాను అన్ని కార్మిక, కర్షక ,ప్రజా సంఘాలు, ప్రజలు పాల్గొని జయపద్రం చేయాలని ఏఐటీయూసీ, రైతు సంఘం నాయకులు పిలుపు నిచ్చారు.శుక్రవారం పట్టణంలోని వేములపల్లి శ్రీకష్ణ భవన్లోని సీపీఐ కార్యాలయంలో ఏపీ కార్మిక సంఘాల ఐక్యవేదిక, ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించే మహాధర్నా జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వర్రావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జవ్వాది సాంబశివరావు, ఆంధ్రప్రదేశ్ చేనేత సంఘం జిల్లా కార్యదర్శి బత్తూరి మోహన్ రావు,బుర్ల శ్రీనివాసరావు, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కో కన్వీనర్ మాత్తే అభిషేక్, ఆళ్ళమూడి హనోక్ బాబు పాల్గొన్నారు.

27న కందుకూరులో బిసిల రాష్ట్ర సభ

- బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు కేసన శంకరరావు

ప్రజాశక్తి-గుంటూరు : క్రిమిలేయర్ విధానంతో బిసిలకు అన్యాయం జరుగుతుందని, తక్షణమే దానిని రద్దు చేయాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక చుట్టుగుంటలోని బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 27న కందుకూరులో నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయాలని కోరారు. బిసిల రిజర్వేషన్‌కు గండిపడేలా కేంద్రం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. విద్యాభివృద్ధిలో నేటి తరానికి క్రిమిలేయర్ పెద్ద అడ్డంకిగా మారిందని చెప్పారు. మెడిసిన్ చదవాలనుకునే విద్యార్థుల కుటుంబాలు ఏడాదికి రూ.12 లక్షలు దాటితే క్రిమిలేయర్ వర్తించి రిజర్వేషన్ కోల్పోతున్నారని తెలిపారు. కావున క్రిమిలేయర్‌ను పూర్తిగా తొలగించాలని, లేదంటే సంవత్సరానికి రూ.30 లక్షల ఆదాయ పరిమితి ఇవ్వాలని కోరారు. రానున్న రోజుల్లో కేంద్రానికి సరైన గుణపాఠం చెబుతారన్నారు. 2016 నుండి వైద్య పీజీ పరీక్షల్లో ఓబిసి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఎంబిబిఎస్‌లో 15 శాతం, పీజీలో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయట్లేదన్నారు. రాష్ట్రంలో నూతన విద్యావిధానం అమలు ఫలితంగా వేలాది ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయని, దీంతో వెనుకబడిన తరగతుల విద్యార్థులు అనివార్యంగా ప్రైవేటు బడికి వెళ్లాల్సి వస్తుందన్నారు. ఈనెల 27 నుండి జరిగే కులగణను సక్రమంగా నిర్వహించాలని, అవకతవకలు జరిగితే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని చెప్పారు. సమావేశంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్, జిల్లా అధ్యక్షులు పి.మహేష్, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కె.హనుమంతరావు, నాయకులు డి.రామకృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శంకరరావు, తదితరులు

ఎస్ఎఫ్ఐ నగర నూతన కమిటీ ఎన్నిక


అధ్యక్ష, కార్యదర్శులు, గరల్స్ కన్వీనర్

ప్రజాశక్తి-గుంటూరు

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నూతన నగర కమిటీ ఎన్నికైంది. శుక్రవారం స్థానిక బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో సంఘం 44వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ నగరంలోని సంక్షేమ హాస్టల్స్‌లో మౌలిక వసతులు కల్పించాలని, కోడిగుడ్డు సత్రం హాస్టల్‌ను వెంటనే ప్రారంభించాలని, పేద విద్యార్థులకు విద్యకు దూరం చేసే నూతన జాతీయ విద్యావిధానం-2020ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్‌ఛార్జీలు పెంచాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా సి.నరసింహ, ఎస్.కె.సమీర్, గరల్స్ కన్వీనర్‌గా ఆరిఫా, ఉపాధ్యక్షులుగా సుచరిత, లక్ష్మణాచారి, సహాయ కార్యదర్శులుగా శ్రీలక్ష్మి, కిన్నెరా ఎన్నికయ్యారు.



సెయింట్ ఆన్స్‌లో జాతీయ సమైక్యతపై అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స మహిళా కళాశాలలో శుక్రవారం జాతీయ సమైక్యతా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మనమంతా ఒక్కటే అనే నినాదంతో జెండా దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఫాతిమారాణి.పి మాట్లాడుతూ భారత దేశం గురించి, మతపరమైన, ఇతర అన్ని రకాల హింస నుండి విముక్తి పొందాలని, పౌరులు శాంతి, సామరస్యంతో జీవించాలని సందేశమిచ్చారు.


ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న తెలుగుదేశం నాయకులు

పొలాలకు నీరందించాలి : టిడిపి

తెలుగు రైతు గుంటూరు పార్లమెంటరీ అధ్యక్షులు కళ్లం రాజశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి ఆంధ్ర రత్న పంపింగ్ స్కీం పంట కాలువ శుభ్రం చేసి, రైతుల పొలాలకు నీరు అందించాలని, గుంటూరు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షులు కళ్ళం రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం తెలుగుదేశం, జనసేన నాయకులు ఎం టి ఎం సి, ఇరిగేషన్ అధికారులతో కలిసి, పంట కాలువను సర్వే చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తాడేపల్లి మండలం రూరల్ గ్రామాలు మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం అయిన తర్వాత అపార్ట్మెంట్ల కల్చర్ పెరిగి, పరిసరాలలో వాడిన వ్యర్థపు నీరంతా పంట కాలువలో వదులుతున్నారని అన్నారు. దీంతో సాగునీరు అంతా కలుషితమై పోయిందని ఆయన ఆవేదన చెందారు. గతంలో అనేకసార్లు జిల్లా, మండల అధికారుల దృష్టికి, తీసుకువెళ్లామన్నారు. ఈ పంట కాలువలో మురుగునీరు చేరడం వలన పంటలు దెబ్బతిని, రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని తక్షణమే పంటకాలను శుభ్రం చేయాలని అధికారులను ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమర సుబ్బారావు, తెలుగు రైతు నాయకులు అక్కినేని సుబ్రమణ్యం, కుంచనపల్లి గ్రామ అధ్యక్షులు కానుగోలు కోటేశ్వర రావు, నల్లి బోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రామిరెడ్డి సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - వినుకొండ

తుమ్మ రామిరెడ్డి ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. బొల్లాపల్లి మండలం మాజీ ఎంపీపీ తుమ్మ రామిరెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా స్థానిక నరసరావుపేట రోడ్డులోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే బోల్ల బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, వైసిపి నాయకులు అన్నపునేని సుధా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తుమ్మ రామిరెడ్డి భార్య, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం అన్న సంతర్పణ నిర్వహించారు.



పోలింగ్ కేంద్రాన్ని యథావిధిగా కొనసాగించండి

ప్రజాశక్తి -కారంపూడి

మండలంలోని చింతపల్లి గ్రామంలోని పోలింగ్ బూత్ 278 ను యధావిధిగా కొనసాగించాలని మండల టీడీపీ నాయకులు,చింతపల్లి ఎస్సీ కాలనీ వాసులు శుక్రవారం డిప్యూటీ తహశీల్దార్ కీర్తి స్రవంతి కి వినతి పత్రం అందజేశారు. 278 బూత్ గతంలో మండల పరిషత్ ఉన్నత పాఠాశాల లో వుండేది, దానిని ప్రస్తుతం ఎస్సీ కాలనీ లోని ప్రాథమిక పాఠశాలకు తరలించారు. ఓటర్లకు అసౌకర్యం కలుగుతుంది కనుక పోలింగ్ బూత్ మార్పు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఉన్నం. లక్ష్మీనారాయణ, చప్పిడి రాము,తండా మస్తాన్ జాని, బేతపూడి వెంకటేశ్వర్లు, తాల్ల పోగు. చంటి,మాజీ ఎంపీటీసీ పాలేపోగు. యల్లమంద, పాలెపోగు. ముత్తయ్య,పెరుపోగు సిద్దయ్య పాల్గొన్నారు.

జనసేన మండల ఉపాధ్యక్షులుగా శరత్

ప్రజాశక్తి-నాదెండ్ల



జనసేనపార్టీ నాదెండ్ల మండల ఉపాధ్యక్షులుగా దడదాసుల శరత్ కు శుక్రవారం నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్ నియామక పత్రం అందజేశారు. పార్టీ అభివద్ధి కోసం కష్ట పడే ప్రతి ఒక్కరినీ పవన్ కళ్యాణ్ గుర్తిస్తారని రాజారమేష్ ఈ సందర్భంగా తెలియజేశారు. తన నియామకంపై శరత్ సంతోషం వ్యక్తం చేశారు.

పోషకాహారంతో రక్తహీనతను జయించొచ్చు

ప్రజాశక్తి-ఈపూరు

విద్యార్థులు పౌష్టికరమైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనతను జయించవచ్చని మండల ప్రత్యేక అధికారి ఎస్.వరలక్ష్మి అన్నారు. బంగారు తల్లి కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో ధనలక్ష్మి వ్యాయామ కళాశాల, విద్యానికేతన్ ప్రైవేటు పాఠశాలను శుక్రవారం ఆమె సందర్శించారు. విద్యార్థుల హిమోగ్లోబిన్ శాతం, ఎత్తు,బరువు నమోదు చేసిన ప్రోగ్రెస్ కార్డులను ఆమె పరిశీలించారు. ప్రతి విద్యార్థిని సగటున 13 % నుండి 15 శాతం హిమోగ్లోబిన్ కలిగి ఉండాలన్నారు. (రక్తహీనత ఉన్న విద్యార్థులను గుర్తించి ఐఎఫ్ మాత్రలు పంపిణీ చేయడంతో పాటు వారిలో హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు.

8 నుండి అంగన్వాడీల సమ్మె

ప్రజాశక్తి-సత్తెనపల్లి

అంగన్వాడీ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, తెలంగాణ లో కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, డిసెంబర్ 8వ తేదీ నుండి జరిగే నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పుతుంబాక భవన్ లో జరిగిన సన్నాహక సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశానికి సుజాత అధ్యక్షత వహించారు. గుంటూరు మల్లేశ్వరి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2022లో అంగన్వాడీలకు గ్రాడ్యూటి అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చ లేదని, హెల్పర్స్ ప్రమోషన్లకు ప్రభుత్వం ఎటువంటి నిబంధనలు రూపొందించ లేదని, సెంటర్ల నిర్వహణకు అంగన్వాడీలే పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితికి నెట్ట బడిందని అన్నారు. ఈ నేపథ్యంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) డిసెంబర్ 8వ తేదీ నుండి నిరవేదిక సమ్మె కు పిలుపు నిచ్చినట్లు చెప్పారు. సమ్మెలో అంగన్వాడీ వర్కర్స్ అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సన్నాహక సమావేశానికి ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొని ఈ పోరాటానికి మద్దతు తెలిపారు. సమావేశంలో కౌలు రైతు సంఘం నాయకులు పెండ్యాల మహేష్. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వి.చంద్రకళ, యం జగన్నాధ రావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సాల్మన్ రాజు, రైతు సంఘం నాయకులు గుంటుపల్లి బాలకష్ణ, ప్రజా నాట్య మండలి నాయకులు పొట్టి సూర్య ప్రకాష్ రావు, డివైఎఫ్ఐ నాయకులు జడ రాజ్ కుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్కే ఇట్లాస్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

అంగన్వాడీ టీచర్లు హెల్పర్లు అతి తక్కువ వేతనాలతో ప్రభుత్వ రంగ విభాగంలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నారని వారి శ్రమకు తగ్గ ఫలితం లభించడం లేదని సిఐటియునాయకులు బండ్ల మహేష్ అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గత ఎన్నికలకు ముందు అంగన్వాడీ వర్కర్లకు చేసిన వాగ్దానాలు నెరవేర్చాలని, కోర్టు తీర్పుల ప్రకారం అంగన్వాడీ వర్కర్లకు అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.



మాచర్లలో ఐసిడిఎస్ కార్యా లయంలో అధికారికి సమ్మె నోటీసును అందజేస్తున్న నాయకులు

సిఐటియుతో పాటు ఎఐటియుసి, ఐఫ్ టి యూ యూనియన్లకు చెందిన అంగన్వాడి వర్కర్లందరూ సమ్మెలో పాల్గొంటున్నారని ప్రభుత్వం సమస్యను వెంటనే పరి ష్కరించాలని కోరారు. సమ్మె నోటీసును ఐసిడిఎస్ కార్యాలయంలో సంబంధిత అధికారికి అందజేశారు.

చేనేతల ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి-పెదకూరపాడు

చేనేతల ఐక్యతే అభివద్ధికి సాధ్యమని జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలూరి ఋషింగప్ప అన్నారు. శుక్రవారం మండలంలోని లగడపాడు గ్రామంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంఘీ బావంగా ఉండి చేనేత కులాలు రాజకీయంగా ఎదిగినప్పుడే చేనేత కుటుంబాలు అభివద్ధి చెందుతాయి అని వచ్చే ఎన్నికల లో చేతి వత్తుల పార్టీ తరుపున చేనేత బీసీ కులాలు చేతి వత్తుల వారందరూ పోటీ చేసి మన సత్తా చాటలనిఆయన కోరారు రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగం రామచంద్ర, ఎపి పద్మశాలి ఉద్యోగ సంఘం స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సాముల హనుమంతరావు, పద్మశాలి సంఘము కస్తూరి వెంకటేశ్వర్లు రాష్ట్ర పద్మశాలి యువ శక్తి ప్రతినిధులు మునగపాటి రమేష్ గోలి వంశీ కష్ణ మరియు పెదకూరపాడు , సత్తెనపల్లి నియోజక వర్గాల నేతన్నలు సంఘీభావంగా అందరూ పాల్గొన్నారు చేనేత ఐక్య వేదిక సంఘం నాయకులు మాట్లాడుతూ నేతన్నలు అందరూ సంఘీభావంగా ఉండి ప్రభుత్వము నుండి చేనేత కార్మికుల హక్కులు,రాయితీలు, ప్రోత్సాహకాల కోసం పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించిన పెదకూరపాడు జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం అధ్యక్షుడు చిల్లపల్లి సత్యం మాట్లాడుతూ సమష్టి గా పోరాడి సంక్షోభంలో ఉన్న చేనేతను కాపాడు కోవాలని అన్నారు. కార్యక్రమంలో పెదకూరపాడు, సత్తెనపల్లి నుండి చేనేత కార్మికులు హాజరయ్యారు. అనంతరం జిల్లా, నియోజకవం, గ్రామ పట్టణ కమిటీల నూతన కార్యవర్గం నియామకం జరిగింది.



లగడపాడులో మాట్లాడుతున్న ఋషింగప్ప

లింగంగుంట్లలో 'యూత్ జో డో బూత్ జో డో'

ప్రజాశక్తి-పెదకూరపాడు

ప్రత్యేక హోదా రావాలంటే రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావాలని పల్నాడు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా గోపి అన్నారు. శుక్రవారం మండలంలోని లింగంగుంట్లలో యూత్ జో డో బూత్ జో డో కార్యక్రమం నిర్వహించారు. గోపి మాట్లాడుతూ గ్రామంలోని యువకులకు దేశంలో,రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావలసిన ఆవశ్యకతను వివరించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలన్నా, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి కావాలన్నా ,కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలన్న రైతులకు రుణమాఫీ జరగాలన్న రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలన్నారు. రాష్ట్రంలోని ప్రాం తీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వ చర్యలకు అడుగులకు మడుగులు ఒత్తుతూ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో విఫలమయ్యాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు కరపత్రాలను గ్రామ ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు ముప్పెర ఉదయ్ శంకర్ తొర్లకుంట వినయ్ కుమార్ శివాజీ పాల్గొన్నారు.



వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేటలోని ప్రకాష్‌నగర్‌లోని తిలక్ పురపాలక ఉన్నత పాఠశాలలో శుక్రవారం పల్నాడు జిల్లా వినియోగదారుల సంఘం ఏంజెల్ ప్రైడ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ ప్రెసిడెంట్ పిల్లి యజ్ఞ నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుండే వినియోగదారుల రక్షణ చట్టం పై అవగాహన కలిగి ఉండాలని, వస్తువులు కొనుగోలు చేసినపుడు తప్పనిసరిగా బిల్ తీసుకోవాలని సూచించారు. తయారీదారుని అడ్రస్, లైసెన్సు వివరాలు లేని వస్తువులను కొని మోసపోవద్దని, గ్యాస్ డెలివరీ సమయం లో గ్యాస్ డెలివరీ గొడౌన్ నుండి 15 కిలోమీటర్ల పరిధిలో డెలివరీ చార్జెస్ కింద ఎటువంటి రుసుము చెల్లించాల్సిన పని లేదన్నారు. గ్యాస్ ప్రమాదం జరిగితే ఏజన్సీ ద్వారా నష్టపరిహారం పొందే వీలుందని, అందుకు గ్యాస్ డెలివరి అడ్రస్‌లోనే బాధితుడు నివాసం ఉండాలన్నారు. కల్తీ ఆహార పదార్థాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, వీలైనంత వరకు బయటి ఆహారం తినకుండా ఉండటం మంచిదన్నారు. సంస్థ జాయింట్ సెక్రెటరి షైక్ షముల్లా మాట్లాడారు. వినియోగదారుల వ్యవ హారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖ కమిషనర్ వినియోగదారుల అవగాహన నిమిత్తం తయారు చేసిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సంస్థ వైస్ ప్రెసిడెంట్ రెబ్బా ఆది నారా యణ, పాల్గొన్నారు. రొంపిచర్ల జెడ్‌పి హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.





రాష్ట్రంలో అరాచకపాలన: టిడిపి

ప్రజాశక్తి - వినుకొండ

రాబోయే ఎన్నికల్లో జగన్ రెడ్డి అరాచక పాలనకు ప్రజలు బుద్ధి చెప్పి వెసిపిని రాష్ట్రం నుంచి తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు జీవీ ఆంజనేయులు అన్నారు. బాబు షఉరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ.. కార్యక్రమం శనివారం వినుకొండ పట్టణంలోని ఒకటవ వార్డు కళ్యాణపురి కాలనీలో నిర్వహించగా టిడిపి,జనసేన సంయుక్త ఆధ్వర్యంలో ఇంటింటికి పర్యటించారు. వైసిపి అక్రమాలను వివరించి మేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జీవి ఆంజనేయులు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

2024 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని అధికారంలోకి రాగానే అన్నదాత పథకం కింద రైతుకు పెట్టుబడి సాయంగా ప్రతి రైతుకు ఏడాదికి రూ 20 వేలు ఇవ్వడం జరుగుతుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక బాలయ్య నగర్‌లో ఆయన పర్యటించారు.

అక్రమకేసులు తగదు

ప్రజాశక్తి-పెదకూరపాడు

'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' పథకంతో వైసిపి ప్రభుత్వంలో వణుకు మొదలైందని పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆ భయంతోనే పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు.

ఆరోగ్య బీమాపై అవగాహన

ప్రజాశక్తి-నూజెండ్ల

ఐటీసీ-సెర్ప్ ఆధ్వర్యంలో క్లాప్ మిత్రలకు ఆరోగ్య బీమా పై అవగాహన కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథి మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి. వీరభద్రచారి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ పేద అణగారిన గ్రామీణ కుటుంబాలు,పట్టణ కార్మిక కుటుంబాలను గుర్తించి వృత్తి వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను అందిస్తుందని అన్నారు. ఐటిసి-సెర్ప్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఈఓపిఆర్ డి రవికుమార్, స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ సమన్వయకర్త సుబ్బరామయ్య, ఐటీసీ సిబ్బంది ప్రదీప్ కుమార్, ఏసోబు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

రెండో పంటగా అపరాల సాగు ఉత్తమం

ప్రజాశక్తి - చేబ్రోలు



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖాధికారి

పంట నీటి లభ్యత కొరత ఉన్నందున రైతులు రెండో పంటగా అపరాల సాగు చేయాల్సిందిగా రైతులకు అధికారులు సూచించారు. శుక్రవారం స్థానిక మండల వ్యవసాయ శాఖాధికారి కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి బి. శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ మొక్కజొన్న, జొన్న పంటలకు సరిపడా పంట నీరు అందించలేని పరిస్థితి ఉందని, అపరాలు సాగు రైతులకు మేలు చేస్తుందని చెప్పారు. రెండవ పంటగా మొక్కజొన్న, తెల్ల జొన్న పంటలు వేయడం వల్ల నీరు అందదని అన్నారు. ఎందుకంటే మొక్కజొన్న ,జొన్న పంటలకు రెండు, మూడు నీటి తడులు ఇవ్వాల్సి ఉన్నందున నీరు అందదని జిల్లా కలెక్టర్ తెలియజేసినట్లు పాల్గొన్న రైతులతో తెలిపారు. సమావేశంలో కెవికె శాస్త్రవేత్త డాక్టర్ అనిల్ కుమార్, మండల అగ్రి అడ్వైజరి బోర్డు చైర్ పర్సన్ బి. అప్పిరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి సునీత,ప్రవీణ్ కుమార్, భానురేఖ పాల్గొన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కార్తీక మాసం సందర్భంగా భక్తుల సందర్శనార్థం తెనాలి బస్ డిపో నుండి పంచారామాలు, శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎ రాజశేఖర్ శుక్రువారం ప్రకటన విడుదల చేశారు. పంచారామాలు (సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతి) శైవ క్షేత్రాలు (యాగంటి, మహానంది, శ్రీశైలం) అరుణాచలం (శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్) అలాగే శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు ప్రత్యేక బస్సులు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. పంచా రామాలకు ప్రతి శనివారం, ఆదివారం సాయంత్రం 08:00 గంటలకు తెనాలి డిపోనుంచి బయలుదేరనున్నట్లు తెలిపారు. ప్రత్యేక రాయితి వివరాలకు 7382892492, 9959225422 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.



'వైసిపి పాలనలో కాపులకు తీవ్ర అన్యాయం'

ప్రజాశక్తి - మంగళగిరి

కాపులకు ముఖ్యమంత్రి జగన్ తీవ్ర అన్యాయం చేస్తున్నారని మంగళగిరి నియోజకవర్గ టిడిపి కాపుదళం నాయకులు విమర్శించారు. శుక్రవారం స్థానిక టిడిపి కారా ్యలయంలో కాపుదళం కన్వీనర్ రంగిశెట్టి నరేంద్ర(బాబి), రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, మంగళగిరి పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, తాడేపల్లి పట్టణ తెలుగు మహిళ అధ్యక్షురాలు అన్నె కుసుమ విలేకరులతో మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం కాపులకు ఐదు శాతం రిజర్వేషన్లను కల్పించగా జగన్ వచ్చీ రావడంతోనే వాటిని రద్దుచేసి కాపులపట్ల తనకున్న ద్వేషాన్ని బహిరంగంగానే చాటుకున్నారని మండిపడ్డారు. టిడిపి ప్రభుత్వ హయాంలో కాపులకు కల్పించిన ఐదు శాతం రిజర్వేషన్‌ని జగన్ హయాంలో నిలుపుదల చేయడంతో 14,343 మంది కాపు నిరుద్యోగులు సచివాలయాల్లో ఉద్యోగాలు కోల్పోయారన్నారు. కాపు కార్పొరేషన్‌కు చెందిన రూ.3,100 కోట్లను వైసిపి ప్రభుత్వం మళ్లించి కాపులకు అన్యాయం చేసిందన్నారు. కాపు నేస్తాన్ని సగానికి తగ్గించి 1.2 లక్షల మందికి మాత్రమే అందిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో తాడే పల్లి మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు బొర్రా కృష్ణవందన, తోట సాంబశివరావు, ఆకుల ఉమామహేశ్వరరావు, గాదె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నకిలీ మద్యంతో పేదల జీవితాలు చిన్నాభిన్నం

పేద,మధ్యతరగతి ప్రజలను జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నయవంచన చేసిందని, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని తెలుగుదేశం పార్టీ బిసి సెల్ రాష్ట్రప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు అన్నారు. 'బాబు ష్యూరిటి భవిష్యత్తు గ్యారెంటీ 'కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 20వ వార్డు లో టిడిపి జిల్లా తెలుగు యువత నాయకులు బిట్రా దుర్గారావు ఆధ్వర్యంలో కుప్పురావు కాలనీ లో ఇంటింటికి తిరిగారు.

అంగన్వాడీ కేంద్రాల మరమ్మతులకు రూ 73.65 లక్షలు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని 83 ప్రభుత్వ అంగన్వాడి కేంద్రాలు, రెంటు ఫ్రీ అంగన్వాడి కేంద్రాల కనీస అవసరాలు, మరమ్మతులకు ప్రభుత్వం రూ.73 లక్షల 65 రూపాయలు మంజూరు చేసిందని పొన్నూరు ఐసిడిఎస్ సిడిపిఒ ఎస్ వెంకటరమణ తెలిపారు. శుక్రవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడి కేంద్రాల కార్యకర్తలకు ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రాజెక్టు పరిధిలోని 67 ప్రభుత్వ అంగన్వాడి కేంద్రాలు, 16 రెంట్ ఫ్రీ అంగన్వాడి కేంద్రాల మరమ్మత్తులకు నిధులు మంజూరయ్యాయని చెప్పారు మనబడి నాడుబి నేడు పథకం ఫేస్‌బి2 కింద ఈ నిధులు మంజూరైనట్లు వివరించారు. అంగన్వాడి కేంద్రాల్లోని టాయిలెట్స్, డ్రింకింగ్ వాటర్, వైరింగ్, పెయింటింగ్ వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. సమావేశంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న గుంటూరు సమగ్ర శిక్ష అభియాన్ ఎఇ సుబ్బారావు మాట్లాడుతూ



అంగన్వాడి కేంద్రాల కార్యకర్తల సమీక్ష సమావేశం

అంగన్వాడీ కేంద్రాల మరమ్మత్తుల పనులు పేరెంట్ కమిటీల ద్వారా పూర్తి చేస్తారని తెలిపారు. అంగన్వాడి కేంద్రాల కార్యకర్తలు కమిటీలు ఏర్పాటు చేసి బ్యాంకుల్లో ఖాతాలు ప్రారం భించాలని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలకు పలు సమస్యలు, సందేహాలను ఆయన నివృతి చేశారు. తక్షణమే అంగన్వాడి కేంద్రాల మరమ్మతు పనులకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలు, ప్రాజెక్టు సూపర్‌వైజర్లు పద్మావతి, సంపూర్ణ, అలివేలు మంగ ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్ పర్సన్ రాధిక

సంక్షేమ బోర్డుల ప్రదర్శన

ప్రజాశక్తి-తెనాలి

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి దారులతో కూడిన బోర్డులను వార్డు సచివాలయాల వద్ద ప్రదర్శిస్తూ సంక్షేమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం 24వ వార్డులోని 29వ సచివాలయం, మారీసు పేట 21వ వార్డులోని 25వ సచివాలయం, అయితా నగర్ లింగా రావు సెంటర్లోని రెండవ వార్డు రెండవ సచివాలయంలో లబ్ధిదారుల బోర్డులను ప్రదర్శించారు. నేరుగా లబ్ధి పొందుతున్న 25 పథకాలు, 8 నగదురహిత పథకాలు, మరో ఐదు ప్రాధాన్యత కలిగిన పథకాలలో లబ్ధిదారుల వివరాలు, సంక్షేమ పథకాలకు వెచ్చించిన నగదు మొత్తం వివరాలను ఆ బోర్డులలో పొంద పరిచారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా సచివాలయాల పరిధిలో రూ.69.46 కోట్లు వెచ్చించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మండల వైసిపి నాయకులు కోరారు. పొన్నూరు మండలం కొండమూదిలో శుక్రవారం 'ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలి? కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండమూదిలో సంక్షేమ పథకాల బోర్డును మండల వైసిపి నాయకులు ఆవిష్కరించారు.



27 నుండి 'ఆడుదాం ఆంధ్ర'కు పేర్లు నమోదు

ప్రజాశక్తి - చేబ్రోలు

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమ నిర్వహణకు సన్నాహ ఏర్పాట్లు గురించి మండల స్థాయి సమీక్ష నిర్వహించినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.బాబురావు తెలిపారు. డిసెంబర్ 15వ తేదీ నుండి 20 వరకు జరిగే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా క్రీడాకారుల గుర్తింపు నమోదు కార్యక్రమాలను సమీక్షించి సూచనలు ఇచ్చామన్నారు. సచివాలయ పరిధిలోఈ నెల 27వ తేదీ నుండి ఆడుదాం ఆంధ్రకు క్రీడాకారుల పేర్లను నమోదును ప్రారంభించాలని మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించినట్లు చెప్పారు.ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో 114 మంది పురుష క్రీడాకారులు, 114 మంది బాలిక క్రీడాకారులను సచివాలయ పరిధిలో 220 మంది నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఈవో పి ఆర్ అండ్ ఆర్ డి జి.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ అధికారులు ఎవికె ప్రసాద్,ఆర్.సుబ్బారావు పాల్గొన్నారు.

ఎపిపిఎస్సి గ్రూప్- 2 పరీక్షలకు 27 నుండి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-పెదకాకాని రూరల్

గౌడ సేవా సమితి ఆధ్వర్యంలో కౌండిన్య ఐఎఎస్ అకాడమీ ఏపీపీఎస్సీ గ్రూప్ -2 పరీక్షలకు శిక్షణ తరగతులు ఈ నెల 27 నుండి ప్రారంభం కానున్నట్లు టిజెపిఎస్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్, గౌడ సేవా సమితి ఫౌండర్,చైర్మన్ ఇవి నారాయణ తెలిపారు. మండల పరిధిలోని వెని గండ్ల గ్రామ శివారు కౌండిన్య ఐఎఎస్ అకాడమీలో శుక్రవారం విలేకరుల తో ఆయన మాట్లాడుతూ నిష్ణాతులైన అధ్యాపకుల బృందం తోను, ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, ఆచార్య డాక్టర్ ఎం.కోటేశ్వరరావు గెస్ట్ ఫ్యాకల్టీగా తమ సేవలను అందించనున్నట్లు తెలిపారు. లాభా పేక్ష లేకుండా, నామమాత్రపు ఫీజుతో, కుల మతాలకు అతీతంగా



కౌండిన్య ఐఎఎస్ అకాడమీలో విలేకరులతో మాట్లాడుతున్న ఇవి నారాయణ

అనేకమంది నిరుద్యోగ, ఉద్యోగులకు శిక్షణ ఇప్పించాలనే సంకల్పంతో, దాతల సహాయంతో నిర్మాణ నిర్వహణలు చేపట్టినట్లు తెలిపారు. పెద్ద మొత్తంలో ఫీజులు చెల్లించలేని వారితోపాటు, చెల్లించగలిగే ఉద్యోగులు తమ తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గించాలనుకునే పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



శరణాలయం వార్షికోత్సవ ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఎమ్మెల్సీ కార్యాలయంలో శుక్రవారం చినకాకాని షైన్ ఆనంద శరణాలయంలో డిసెంబర్ 17న జరిగే వార్షికోత్సవ ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని పిల్లలను చేరదీసి అన్ని సదుపాయాలు కల్పించి తీర్చిదిద్దటం అభినందనీయమన్నారు. దాతల సహకారంతో నడుపుతున్న శరణాలయానికి ప్రజల సహకారం ఎంతైనా అవసరమన్నారు. కార్యక్రమంలో షైన్ ఫౌండేషన్ చైర్మన్ డిజి నాయక్, పి.సత్యనారాయణ, పి.సాంబశివరావు, కె.రాంబాబు, జి.రాజారావు, రాము తదితరులు పాల్గొన్నారు.



లైంగిక వేధింపుల నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

అనంతపురం జిల్లా గోరంట్ల గ్రామానికి చెందిన చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన పిపి రమేష్, మరో వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ప్రముఖ న్యాయవాది, మాల యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొందుగల చైతన్య డిమాండ్ చేశారు. శుక్రవారం పొన్నూరు లోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నిందితుడిని తప్పించేందుకు పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం కలసి చిన్నచిన్న సెక్షన్లు పెట్టడంపై ఆయన మండిపడ్డారు. సోమవారం లోగా నిందితులపై 307, 420, ఫోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. చిన్నారికి మెరుగైన వైద్యం చేసి సంరక్షణ చేయాలనీ కోరారు. నిందితులు కేసును ప్రభావితం చేయకుండా వారిని విధుల నుంచి తప్పించనిపక్షంలో కలిసి వచ్చే అన్ని ప్రజా దళిత సంఘాలను కలుపుకొని చలో డిజిపి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.



పూర్తయిన హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక వైకుంఠపురం శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం జరిగిన హుండీ లెక్కింపు కార్యక్రమం పూర్తయింది. దేవాదాయశాఖ సహాయ కమిషనర్, పొన్నూరు శ్రీ భావన్నారాయణ స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి రమణమ్మ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. 90.900 మిల్లి గ్రాముల బంగారం, 1 కేజీ 50 గ్రాముల వెండితో పాటు రూ.61,35,598 లక్షల నగదు కానుకల రూపంలో వచ్చినట్లు ఆలయ కార్యనిర్వ హణాధికారి ఎం.తిమ్మానాయుడు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కంభం సాయిబాబు, సభ్యులు, ఎక్స్‌అఫిషియో సభ్యుడు, యూనియన్ బ్యాంక్ అధికారులు, స్కౌట్ అండ్ గైడ్ సిబ్బంది పాల్గొన్నారు.

మలినేని అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు



మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజి సిఎస్ఇ హెచ్ఓడి గోనుగుంట్ల రామస్వామికి ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ పిహెచ్‌డి ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎన్‌యు ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.సత్యప్రసాద్ పర్యవేక్షణలో 'డేటా సెక్యూరిటీ ఆన్ డిఎన్ఎ బేస్డ్ క్రిప్టో అల్గారిథమ్స్' అనే అంశంపై రామస్వామి పరిశోధన చేశారన్నారు. ఈ సందర్భంగా రామస్వామికి కళాశాల అధినేత డాక్టర్ ఎం.పెరుమాళ్ళు, ప్రిన్సిపాల్ అప్పారావు, తదితరులు అభినందనలు తెలిపారు.

పిచ్చుకల ప్రేమికుడు శ్రీనివాస్‌కు పట్టాభి పురస్కారం

ప్రజాశక్తి-గుంటూరు



పురస్కారం అందుకుంటున్న శ్రీనివాస్

పిచ్చుకల ప్రేమికుడు, పిచ్చుకల సంరక్షణకు సేవ్ స్పారో ఉద్యమం ద్వారా ప్రజల్లో చైతన్యానికి కృషి చేస్తున్న విజయవాడకు చెందిన ప్రముఖ చిత్రకారుడు గోరుపర్తి శ్రీనివాస్‌కు జాతీయ స్థాయి డాక్టర్ బి.పట్టాభి సీతా రామయ్య పురస్కారం లభించింది. శుక్రవారం స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ పట్టాభి కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డు కార్యక్రమంలో త్యాగరాజు సాంస్కృతిక సంఘం అధ్యక్షులు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, ఆంధ్రా బ్యాంకు రిటైర్డ్ డైరెక్టర్ కె.హరిబాబు, ముంబాయి ఎగ్జిమ్ బ్యాంకు రిటైర్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బి.రమేష్‌బాబు, లయన్స్ మాంటిస్సోరి హైస్కూల్ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ యం.నాగరాజకుమారి, నంది అవార్డు గ్రహీత కావూరు సత్యనారాయణ, పట్టాభి కళాపీఠం అధ్యక్షులు తూములూరి రాజేంద్రప్రసాద్ చేతులమీదుగా శ్రీనివాస్ అవార్డును అందుకున్నారు. ఈ పురస్కారం పిచ్చుకల సంరక్షణపై తన బాధ్యతను మరింత పెంచిందని శ్రీనివాస్ పేర్కొన్నారు.



ఏడీకి వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఎపిజిఎల్ఐ రుణాలు చెల్లించకుంటే ఆందోళన : యుటిఎఫ్

ప్రజాశక్తి-గుంటూరు : ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన లోన్లు, క్లోజర్లు వెంటనే చెల్లించాలని లేకపోతే ఆందోళన తప్పదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ స్పష్టం చేశారు. శుక్రవారం ఎపిజిఎల్ఐ అసిస్టెంట్ డైరెక్టర్ బాబూరావుకు యుటిఎఫ్ నాయకులు ప్రాతినిధ్యం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, యం.కళాధర్ మాట్లాడుతూ 8 నెలలుగా ఉద్యోగుల చెల్లింపులు నిలుపుదల చేశారని, నాలుగు నెలలుగా సేవలు పూర్తిగా నిలిపివేసి, ప్రభుత్వం ఉద్యోగుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని విమర్శించారు. టెక్నాలజీ దూసుకుపోతున్న ఆధునిక యుగంలో యాప్ రూపొందించే పేరుతో నాలుగు నెలలుగా సేవలు నిలిపేయటం శోచనీయం అన్నారు. ఎన్నో అవసరాలతో లోన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు గడువు ముగిసి ఫైనల్ పేమెంట్ పొందాల్సిన వారు చాలా ఆవేదనతో ఉన్నారన్నారు. కావున తక్షణమే సేవలు పునరుద్ధరించి, చెల్లింపులు జరపాలని, లేనిపక్షంలో పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు సిహెచ్. ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, ఎం.గోవిందయ్య, ఎం.కోటిరెడ్డి, కె.ప్రభూజీ, కె.ప్రేమ్‌కుమార్, ఎన్.శివరామిరెడ్డి పాల్గొన్నారు.

మలబార్‌లో బ్రాండెడ్ జువెలరీ షో ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు లక్ష్మీపురం లోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూం లో శుక్రవారం అర్టిస్ట్రీ బ్రాండెడ్ జువెలరీషో ఒక విశిష్ట ఆభరణాల ప్రదర్శనను ప్రముఖ వైద్యులు డాక్టర్ బూసిరెడ్డి దీప్తి, వ్యాపార వేత్త పెద్ది రమణ రావు శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. డాక్టర్ బూసిరెడ్డి దీప్తి మాట్లాడుతూ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ లో నాణ్యత, స్వచ్ఛమైన ఆభరణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. స్టోర్ హెడ్ నదీర్, మార్కెటింగ్ మేనేజర్ గోపి కిరణ్‌లు మాట్లాడుతూ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ గుంటూరు షోరూంలో అర్టిస్ట్రీ షో నవంబర్ 24 నుండి 27 వరకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తమ సంస్థ సామాజిక బాధ్యత రూపంలో ఆరోగ్యం ,ఉచిత విద్య, నిరు పేదలకు గహ నిర్మా ణం, మహిళా సాధి . కారిక ఇంకా పర్యావరణ పరిరక్షణ విభాగాలలో తమ వంతు సహాయం అందిస్తుంది తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనం బాల వాణి, శ్రావణి, అన్నపరెడ్డి సంధ్యారాణి, మలబార్ సిబ్బంది పాల్గొన్నారు.



జి జిహెచ్‌ను సందర్శించిన న్యాయమూర్తులు

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి



రాష్ట్రంలోని జిల్లా న్యాయమూర్తుల శిక్షణ కార్యక్రమం లో భాగంగా శుక్రవారం 30 మంది ఏపీ లోని వివిధ జిల్లాల న్యాయమూర్తులు ప్రభుత్వ ఆసుపత్రి లోని వివిధ విభాగాలను పరిశీలించారు. హైకోర్టు ఆదేశల మేరకు ఎపి జ్యూడిషియల్ అకాడమీ డైరెక్టర్ హరిహర నాధ శర్మ , సీనియర్ ఫాకల్టీ డాక్టర్ వై శ్రీనివాస రావు పర్యవేక్షణ లో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి లోని వివిధ వార్డులను న్యాయవాదుల బృందం పరిశీలించింది. ముందుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ను బృందం సభ్యులు కలిశారు. అనంతరం క్యాజువాల్టీ, ఆర్థోపెడిక్ , రక్త పరీక్ష కేంద్రం తో పాటు వివిధ వార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ వైద్య రంగం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కష్టపడుతోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి లో త్వరలో లివర్ మార్పిడి శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు ఆయన చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రి లో పేద ప్రజలకు బైపాస్ ఆపరేషన్ చేయడమనేది ఒక కల లాంటిదని ఆ కలను సాకారం చేస్తున్నామన్నారు. రెగ్యులర్ సర్జరీల తో పాటు అవయవ మార్పిడి శస్త్ర చికిత్సలు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నామని ఆయన అన్నారు. గతంలో హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్ళవల్సిన పరిస్థితి ఉండేదని ఇప్పుడు వాటి సరసన గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి చేరుకుందని ఆయన చెప్పారు. వైద్యం కోసం వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండాలన్న ఉద్దేశ్యంతో ఏపీ ప్రభుత్వం ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేస్తోందని ఆయన తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రము లో వైద్య రంగం పరుగులు పెడుతోందని అయన చెప్పారు. ఆసుపత్రి లో అందుతున్న వైద్య సేవల గురించి న్యాయమూర్తుల ద్వారా సమాచారం ప్రజల్లోకి వెల్లసిన అవసరం ఉందని అయన అన్నారు. కార్యక్రమం లో పలు జిల్లాల న్యాయమూర్తులు యస్ చినబాబు, పాండురంగారెడ్డి, రామచంద్రుడు,దీనబాబు, శైలజ, ఆనంది, గాయత్రీ, బిందు మాధవి, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి టి కె రెడ్డి, ఎముకలు కీళ్ళ విభాగం హెచ్ ఓ డి డాక్టర్ ఎస్ ఎస్ వి రమణ, డాక్టర్ రాధిక, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

జనవరి 1 నుంచి నేషనల్ క్రికెట్ ఛాంపియన్‌షిప్

ప్రజాశక్తి-గుంటూరు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ తదితరులు

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో వచ్చే సంవత్సరం జనవరి 1 నుంచి మహోత్సవ్-2కె 24లో భాగంగా జాతీయ స్థాయి క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహి స్తున్నట్లు వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. శుక్రవారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రికెట్ చాంపియన్‌షిప్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ పోటీలకు యంగ్ ఇండియన్స్ (వుయ్ కెన్ వుయ్ వెల్) సంస్థ ఈవెంట్ పార్టనర్‌గా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. యూని వర్సిటీలు, ఇంజినీరింగ్ కళాశాలలు, ఫార్మసీ కళాశాలల్లో డిగ్రీ, పీజీలను అభ్యసించే విద్యార్థులందరూ ఈ పోటీలలో పాల్గొన వచ్చునని చెప్పారు. ఒకే కళాశాల నుంచి ఎన్ని జట్లైనా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని, అయితే ఒక టీమ్‌లో ఆడిన విద్యార్థి మరో టీమ్‌లో ఆడటానికి అవకాశం లేదని వెల్లడించారు. మ్యాచ్‌లను నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, మెడల్స్‌తోపాటు విన్నర్‌కు రూ.50వేలు, రన్నర్‌కు రూ.30వేలు, మూడో స్థానంకు రూ.20వేలు, నాలుగో స్థానంకు రూ.10వేలు నగదు బహుమతులను అందజేస్తామని వెల్లడించారు. అలాగే మ్యాన్ ఆఫ్ ద సిరీస్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్, మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ అవార్డులను కూడా అందజే స్తామన్నారు. క్రికెట్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనాలనుకునే విద్యార్థులు www.vignan.ac.in/mahotsav/mcc వెబ్‌సైట్‌లో తమ టీమ్‌లను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని తెలియజేశారు.

మలినేని ఫార్మసీ కాలేజీలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

పుల్లడిగుంటలోని మలినేని పెరుమాళ్ళు ఫార్మసీ కాలేజిలో 62వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలలో భాగంగా రెయిన్‌బో బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 42 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈసందర్భంగా కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ ప్రతి 3 నెలలకు ఒకసారి రక్తదానం చేయటం వల్ల సమాజానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. గుండెపోటు, రక్తపోటు, కొలెస్ట్రాల్ లాంటి వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చన్నారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థులు



కార్యక్రమంలో కాలేజి డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాసకుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుధాకర్, విభాగాధిపతి డాక్టర్ జి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాబ్లం సాల్వింగ్ అండ్ ఐడియేషన్‌పై ఆర్‌విఆర్‌లో వర్క్‌షాప్

ప్రజాశక్తి-గుంటూరు



డాక్టర్ చంద్రమౌళిని సన్మానిస్తున్న ప్రిన్సిపల్ తదితరులు

విద్యార్థులు విజయం సాధించే వరకూ నిత్యం పరిశోధనలు చేయాలని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. చౌడవరంలోని కళాశాలలోని ఐఐసి అండ్ ఈఎండి సెల్, ఇన్ఫోఫోర్జ్ : ఐడియేట్ అండ్ ప్రోటోటైప్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈవర్క్‌షాప్‌నకు అనంతపురం శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ ఇంక్యుబేషన్ సెంటర్ మేనేజర్ డాక్టర్ సి.చంద్రమౌళి పాల్గొని ప్రసంగించారు. నూతన ఆవిష్కరణలకు, అంకుర పరిశ్రమల స్థాపనకు విద్యార్థుల ఆలోచన విధానం ప్రధాన ఘట్టమని, అందులో ఎదురయ్యే సమస్యలకు సత్వర పరిష్కార మార్గాలు కనుగొన్నప్పుడే విజయం లభిస్తుందని, ప్రతి పరిష్కారం నూతన సమస్యను సృష్టిస్తుందని, వాటి పరిష్కారానికి విద్యార్థులు సిద్ధంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. నిత్యకృషి వల్లే సత్ఫలితాలు సాధించొచ్చని కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.